సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 6 | జూలై | 2025



'జూనోటిక్'తో జాగ్రత్త

కుక్కలు, పశువులు, కోళ్లు, ఇతర జంతువుల నుంచి సంక్రమించే జూనోటిక్ వ్యాధుల విషయంలో పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారులు తెలిపారు. - 8లో▸



రేపు కేయూ స్నాతకోత్సవం

కేయూ ఆడిటోరియంలో రేపు (సోమవారం) నిర్వహించే స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33^0 /25^0

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నీలా, నిత్యా క్రమాలలో పూజలు




హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయ శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు శనివారం పదో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారిని నీలా, నిత్యా క్రమాలలో పూజలు నిర్వహించారు. అర్చకులు భద్రకాళి శేషు, ఈఓ శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు తొలి ఏకాదశి

హన్మకొండ కల్చరల్ : ఆషాఢమాసం తొలి ఏకాదశి పండుగను ఆదివారం నగర ప్రజలు జరుపుకోనున్నారు. పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. పండుగ రోజు తమ వద్ద పని చేసే పనివారికి కొత్త బట్టలు పెట్టి పిండి వంటలతో భోజనం పెడుతారు. మాంసాహారులు ఏకాదశి రోజు కంచంలో బొక్కకొడితే కైలాసంలో గంట మోగుతుందని భావిస్తారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

శ్రీరుద్రేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. అదేవిధంగా విష్ణుప్రీతికరమైన తొలిఏకాదశి నుంచి మొదలుకుని శ్రావణమాసం పూర్తయ్యే వరకు వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి.

కలెక్టరేట్‌లో లిఫ్ట్‌కు మరమ్మతులు



హన్మకొండ అర్బన్: 'లిఫ్ట్ లేక.. మెట్లు ఎక్కలేక' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని రెండు లిఫ్టులకు తక్షణ మరమ్మతులు చేయించారు. శనివారం ఉదయం మరమ్మతులు పూర్తి చేసి వెంటనే వాటిని సందర్శకులు, ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తూ పరిష్కారం దిశగా చొరవ చూపిన 'సాక్షి'కి కలెక్టరేట్ ఉద్యోగులు, వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజలు అభినందనలు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా స్థాయి అండర్-18 బాలబాలికల బాస్కెట్ బాల్ ఎంపికలను ఆదివారం(నేడు) నిర్వహిస్తున్నట్లు బాస్కెల్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపెల్లి రాజు, డోలి సాంబయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి, 2007 తర్వాత జన్మించిన వారు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం (ప్రభుత్వం జారీ చేసిన) ఒరిజినల్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు గద్వాల్‌లోని ఉత్తనూర్‌లో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. కాజీపేటలోని మాన్ట్‌ఫోర్ట్ సీబీఎస్ఈ స్కూల్ మైదానంలో నిర్వహించే ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 8గంటలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు ఎండీ ఇర్ఫాన్ సెల్ నంబర్ 83284 49263లో సంప్రదించవచ్చని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్ : హనుమకొండలోని దివ్యాంగ బాలికల వసతి గృహంలోకి 3వ తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు విద్యనభ్యసించే విద్యార్థినులకు ప్రవేశానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి జయంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని జీ1 రూంనంబర్‌లో గల స్త్రీ,శిశు సంక్షేమాధికారి కార్యాలయంలో సంబంధిత సర్టిఫికెట్లతో సంప్రదించాలని, వివరాలకు 63044 74980 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు ప్రజావాణి రద్దు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ఆ రోజు కేయూలో స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ వస్తున్నందున అధికారులు పూర్తిస్థాయిలో ఆ విధుల్లో ఉంటారని, అందువల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రజావాణిని ఈ వారం రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి వారం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.



తొలి బోనం.. బీరన్నకు ప్రత్యేకం

నేడు వరంగల్ నగరంలో బీరన్న బోనాలు

దప్పుల మోతలు.. పోతురాజుల ఆటలు.. గావుపట్టిన గొర్రెపిల్లతో బీరన్న విన్యాసాలు.. నెత్తిన బోనమెత్తిన ఆడపడుచులు.. వడివడిగా అడుగులో అడుగేస్తూ ఆలయం వైపు నడకలు.. మనసారా మొక్కులు.. ఇలవేల్పునకు తనివితీరా పూజలు. నేడు (ఆదివారం) గ్రేటర్ వరంగల్ నగరంలో బీరన్న బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. బీరన్న బోనం ప్రత్యేకతలు, కురుమల ఆచార, సంప్రదాయాల విశేషాలే ఈ ఆదివారం 'సాక్షి' ప్రత్యేక కథనం. - హన్మకొండ కల్చరల్

- గొర్రెపిల్లను గావుపట్టి ఆలయం వైపు అడుగులు
- కురుమల ఆచార, సంప్రదాయాల నడుమ వేడుకలు
- కులమతాలకు అతీతంగా తరలిరానున్న నగరవాసులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏటా ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి రోజున కురుమలు బీరన్నస్వామికి బోనాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం డప్పుచప్పుళ్ల నడుమ ఆడపడుచులు క్రమపద్ధతిలో అడుగులో అడుగేస్తూ ఇంటినుంచి బోనాలతో ఆలయానికి బయల్దేరి బీరన్నకు నైవేద్యం సమర్పిస్తారు. వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని బీరన్నకుంటలో ఒకే ప్రాంగణంలో రెండు బీరన్న దేవాలయాలున్నాయి. ఓ సీటీ, దేశాయిపేట, రంగశాయిపేటలోని ఆలయాల్లో, ఉర్సు ప్రాంతం వారు ఉర్సు దేవాలయంలో బోనాలు సమర్పించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కురుమల ఆరాధ్యదైవం బీరన్న..

వందల ఏళ్ల క్రితం వర్షాలు పడక పంటలు ఎండిపోయి కరువు ఏర్పడింది. నీరులేక మేత లేక గొర్లు చనిపోతూ జీవాల సంఖ్య తగ్గిపోసాగింది. ఆ సమయంలో తేజోవంతమైన ముఖంతో ఉన్న ఒక బాలుడు మాంకాళమ్మ దగ్గరకు వచ్చి పని చెప్పి అన్నం పెట్టమంటాడు. ఆమె గొర్రెలను కాయమని చెబుతుంది. సరేనని ఆ బాలుడు గొర్రెలు కాస్తుండగా.. గొర్రెలు అభివృద్ధి చెందడం, పంటల సమృద్ధితో ఊరు సుభిక్షంగా మారుతుంది. ఆబాలుడే కురుమల ఆరాధ్య దైవం బీరన్న అని పురాణాలు చెబుతున్నాయి.



బీరన్న దేవాలయంలో కొలువైన దేవతా విగ్రహాలు

సండే స్పెషల్

గావు పట్టడం..

బీరన్న బోనాల్లో గావు పట్టడం ప్రత్యేక ఆచారం. బీరన్న (పోతురాజు).. గొర్రెను బోనాల చుట్టూ మూడు సార్లు తిప్పిన తర్వాత పూనకంతో ఊగుతూ ఆ గొర్రె మెడను నోటితో కొరుకుతాడు. ఆ రక్తాన్ని తిలకంగా ధరిస్తారు. అలా తిలకం ధరిస్తే మంచి జరుగుతుందని, ఆరోగ్యం బాగుంటుందని ఆ కులస్తుల నమ్మకం. ఆ రక్త తిలకం కోసం వేలాది మంది తాపత్రయపడతారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ నుంచి వచ్చిన బీరన్నల విన్యాసాల తర్వాత కరీమాబాద్ బురుజు సెంటర్‌లో గొర్రెపిల్లను గావు పడతారు. ఇది తిలకించేందుకు వేలాది మంది అక్కడికి చేరుకుంటారు. గావు పట్టిన గొర్రెపిల్లను దాటుతూ మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుంటారు.

తొలి ఏకాదశి రోజునే బోనం

తొలి ఏకాదశి రోజునే కురుమలు తమ ఇలవేల్పు అయిన బీరన్న దేవుడికి, బీరన్న భార్య కామారాతికి, అక్క మాంకాలమ్మకు, పోతరాజుకు బోనాలు సమర్పిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు కుల పెద్దలు.. ఆర్యసమాజ్ ఓం జెండాను ఉర్సు బీరన్న దేవాలయంలో, జాతీయ జెండాను కరీమాబాద్ దేవాలయంలో నిలబెట్టడం వారి ఆచారం. బోనం సమర్పించే ముందు మహిళలు గావు పట్టిన గొర్రెపిల్లను దాటుతూ ఆలయానికి చేరుకోవడం ఆనవాయితీ..

బోనాలపై రజాకార్ల ఆగడాలు

1947 జూలై 30న వరంగల్ రైల్వే గేట్ దగ్గర బీరన్న బోనాల ఊరేగింపు జరుగుతున్నపుడు రజాకార్లు దాడి చేశారు. ఉర్సు కరీమాబాద్ ఆర్య సమాజ్ అధ్యక్షుడు ఇటికాల మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆర్య వీరదళం, ఉర్సు ప్రజలు రజాకార్లకు జరిగిన పోరాటంలో పలువురు చనిపోయారు. అయినా రజాకార్లు వెనుదిరగడంతో బీరన్నకుంటలో బీరన్న కొలువైన చోట ఉన్న వేప చెట్టుకు ఇటికాల మధుసూదనరావు ఓం జెండాను కట్టారు. ఆ తర్వాత ప్రతీ సంవత్సరం ఉర్సు బీరన్న దేవాలయంలో కురుమ పెద్దలు, ప్రజలు ఓం జెండాను కట్టిన తర్వాతే బీరన్నకు బోనాలు సమర్పించడం ఆవాయితీగా మారింది.




నియమనిష్టలతో ఉపవాసం



బోనాలు సమర్పించిన తర్వాత మా కుటుంబాన్ని చల్లగా చూడాలని కోరుకుని బీరన్నకు ఇష్టమైన బండారి (పసుపు) బొట్టుగా పెట్టుకుంటాం. ఉదయం నుంచి మా కుటుంబసభ్యులు నియమనిష్టలతో ఉపావాస దీక్షలో ఉంటారు. బోనంలోని నైవేద్య ప్రసాదం స్వీకరించి ఉపవాస దీక్ష విరమిస్తాం..

- ఎం.దీపిక, గృహిణి, ఉర్సు

ఐక్యతను చాటే పండుగ



కురుమల ఐక్యతను చాటే పెద్ద పండుగ ఇది. కురుమలే కాకుండా ఇతర కులస్తులు కూడా ఈ పండుగలో భాగస్వాములవుతున్నారు. పండుగలో భాగంగా దేవాలయంలో కురుమల పనిముట్లకు పసుపు రాసి కంకణాలు కట్టి కల్యాణం నిర్వహిస్తాం.

- కోరే కృష్ణ, కరీమాబాద్ బీరన్న దేవాలయ కమిటీ చైర్మన్

నిష్ఠతో బోనం సమర్పిస్తాం..



ఈపండుగకు బంధువులను, ఆడబిడ్డలను ఇంటికి పిలుచుకుంటాం. ఉదయం పోచమ్మకు, బొడ్రాయికి కొబ్బరికాయ కొట్టి నైవేద్యం పెడతాం. నిష్ఠతో బోనం వండి బీరన్నకు సమర్పిస్తాం. ఒక రోజు ముందే పండుగ పనులు పూర్తి చేసుకున్నాం.

- బండారి స్వరూప

ఏర్పాట్లు పూర్తి..



ఉర్సు కరీమాబాద్ బీరన్న దేవాలయంలో భక్తులు బోనాలు సమర్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 300 బోనాలు సమర్పించే అవకాశం ఉంది. భక్తులు ప్రశాంతంగా పండుగ నిర్వహించుకోవాలి.

- మరుపల్ల రవి, ఉర్సు బీరన్న దేవాలయ కమిటీ చైర్మన్

బాధ్యతగా ప్రజలకు సేవలందించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: ప్రజలకు బాధ్యతగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల మరింత గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన పి.శ్యాం సుందర్, ఎస్.ప్రభాకర్, టి.కట్టస్వామి, వి.శంకర్, ఏ.అర్జున్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈసందర్భంగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి సీపీ అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులపై భరోసా, నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పేదలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని పదోన్నతి పొందిన ఏఎస్సైలకు సూచించారు.

31 మంది మందుబాబులకు జైలు

వారం రోజుల్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన 31 మంది వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గత నెల 28 నుంచి ఈనెల 4వ తేదీ వరకు వారం రోజుల పాటు ట్రైసిటీ ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 376 కేసులు నమోదయ్యాయి. ఇందులో 31 మంది వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. రూ.3.83 లక్షలు వాహనదారులు ఫైన్ రూపంలో కోర్టులో జరిమానాలు చెల్లించారు. నమోదైన కేసుల్లో అత్యధికంగా హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 138 కేసులు కాగా.. ఇందులో 10 మందికి జైలు శిక్ష పడింది. రూ.96,800 జరిమానా విధించారు. వరంగల్ పరిధిలో 134 కేసులో 15 మందికి జైలు శిక్ష, రూ.1,77,100 జరిమానా విధించారు. కాజీపేట పరిధిలో మొత్తం104 కేసులు నమోదు కాగా.. ఆరుగురికి జైలు శిక్ష పడగా, మిగతా కేసుల్లో రూ.1,09,000 జరిమానా చెల్లించారు.



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పదోన్నతి పొందిన ఏఎస్సైలు

విద్యార్థి సంఘాల పేరుతో వసూళ్లకు వస్తే కేసులు పెట్టండి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ హాస్టళ్లనుంచి విద్యార్థి సంఘాల పేరుతో చందాలు, వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెట్టాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. హాస్టల్లో హెడ్మాస్టరు, వార్డెన్లు తప్పు చేయొద్దని, దళారులకు భయపడి మామూళ్లు ఇవ్వకూడదన్నారు. శనివారం హనుమకొండ జులైవాడలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను హుస్సేన్ నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో 400మందికిపైగా విద్యార్థులున్నా సదుపాయాలు సక్రమంగా లేవన్నారు. విద్యార్థి సంఘాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడే బ్యాచ్‌లు ఉన్నన్ని రోజులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే పరిస్థితి లేదన్నారు. ప్రతీ ఆదివారం పండుగ వాతావరణాన్ని తలపించేలా కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్‌కు కావాల్సిన సదుపాయాల విషయంలో తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్, ప్రొజెక్టర్లు, రెండు నెలల్లోపు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థినులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థినులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ రమేశ్, ఐటీడీఏ ఏపీఓ వసంత్ జాదవ్, డీటీడీఓలు ప్రేమకళ, సౌజన్య, హెడ్మాస్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

పాఠశాలల్లో అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వండి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లో కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై వారంలో సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు కేటాయించేందుకు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, కళాశాలలు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, తదితర అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలన్నారు. డీఈఓ వాసంతి, ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఎంజీఎంలో ఏసీబీ అధికారులు?

ఉద్యోగుల విధులపై ఇంటెలిజెన్స్ నిఘా

- కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి
- వివాదాస్పదంగా మారుతున్న టెండర్ నోటిఫికేషన్లు

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రికి ఏసీబీ అధికారులు నిత్యం వస్తూ వెళ్లడం ఇక్కడి అధికారులను భయాందోళనకు గురి చేస్తోంది. ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు లక్షలాది రూపాయల విలువైన ఔషధాల కొనుగోళ్లతో పాటు కోట్లాది రూపాయల టెండర్ల బిల్లుల చెల్లింపులో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వెలువడుతున్నాయి. ఈనేపథ్యంలో ఇటు ఇంటెలిజెన్స్ అధికారులు.. అటు ఏసీబీ అధికారులు ఎంజీఎం ఆస్పత్రిపై నజర్ వేశారు. కొంత మంది కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకుండా అధికారులపై మంత్రులు, ఎమ్మెల్యేల స్థాయిలో బిల్లుల చెల్లింపులో ఒత్తిళ్లు తెస్తుండడంతో అధికారులు చేసేదేమీ లేక కాంట్రాక్టర్లకు తలొగ్గుతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఈక్రమంలో కాంట్రాక్టర్లు కాగితాలపై చూపే లెక్కలతో వారి అందించే అమ్యామ్యాలకు తలొగ్గుతూ కొన్ని నెలలుగా కోట్లాది రూపాయల బడ్జెట్‌ను విడుదల చేసినట్లు జోరుగా చర్చ సాగుతోంది. ఈక్రమంలో ఎంజీఎంలో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అధికారుల్లో చర్చ జరుగుతోంది..



గతంలోనూ ఏసీబీ దాడులు

ఎంజీఎం ఆస్పత్రిలో 2013లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రామకృష్ణను అప్పటి ఆక్సిజన్ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించారు. అలాగే ఓ డైట్ కాంట్రాక్టర్ ఆస్పత్రి ఆర్ఎంఓను ప్రత్యక్ష నగదు అందిస్తూ ఏసీబీ అధికారులకు అప్పగించారు. అనంతరం కొన్నేళ్ల తర్వాత ఏసీబీ అధికారులు ఎంజీఎం ఆస్పత్రికి వస్తూ వెళ్తుండడం అందరినీ ఆలోచింపజేస్తోంది. గత నాలుగు, ఐదు నెలలో ఆస్పత్రిలో ఎలాంటి బిల్లులు చెల్లించారు? ఏయే కాంట్రాక్టర్‌కు ఎంత మేర బిల్లులు చెల్లించారు. ఈబిల్లుల చెల్లింపుల్లో నిబంధనలు పాటించారా? ఏమైనా ఆరోపణలు ఉన్నాయా? అనే కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులతో పాటు ఏసీబీ అధికారులు సైతం దృష్టి సారించారు. అదేవిధంగా ఆస్పత్రిలో ఈ మధ్య కాలంలో చేపట్టిన కారుణ్య నియామకాల వ్యవహారంలో సైతం పెద్ద ఎత్తున ఆరోపణలు వెలువడుతున్నాయి.

వివాదాస్పదంగా మారుతున్న నోటిఫికేషన్లు

ఎంజీఎం ఆస్పత్రిలో గత కొన్ని నెలలుగా అధికారులు పిలుస్తున్న టెండర్ నోటిఫికేషన్లు, నియామక నోటిఫికేషన్లపై ప్రజలకు నమ్మకం లేకుండా పోతోంది. మార్చి 21న దంత వైద్యుల కోసం నోటిఫికేషన్ వెలువరించి ఇంత వరకూ నియామకాలు చేపట్టలేదు. అలాగే ఔషధాల కోసం పిలిచిన టెండర్ల నోటిఫికేషన్ సుమారు నెలలో పూర్తి చేయాల్సిన టెండర్ ప్రక్రియను 9 నెలలు గడిచినా పూర్తి చేయకపోవడంతో ఆ టెండర్‌ను రద్దు చేసి తిరిగి టెండర్లు పిలిచారు. ఎంజీఎం ఆస్పత్రిలో రెండో సారి పిలిచినా టెండర్లకు కాంట్రాక్టర్లకు ముందుకు రాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈక్రమంలో ఆస్పత్రిలో ప్రతీ టెండర్, బిల్లుల చెల్లింపులు వివాదాస్పదంగా మారడంతో రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు ఇంటెలిజెన్స్, ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

రేపు 4వ బెటాలియన్‌లో వస్తువుల వేలం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ మామునూరు 4వ బెటాలియన్‌లో వివిధ రకాల వస్తువులు, అల్యూమీనియం వంట పాత్రలు, ప్లాస్టిక్ కుర్చీలు, ఇనుప సామగ్రి, ఆటవస్తువులు, ట్రైనింగ్ పరికరాలు, ప్రింటర్స్, బ్యారక్‌లో ఉపయోగించిన వస్తువులు, మోటారు వెహికల్స్ స్పేర్ పార్ట్స్, బ్యాటరీలు తదితర వస్తువులను విక్రయించేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు శనివారం సంబంధిత అధికారులు ప్రకటించారు. ఈనెల 7న సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

న్యూశాయంపేట: మెనూను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కేఏ.గౌస్ హైదర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం హంటర్ రోడ్డులోని బాలికల గురుకులాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కిచెన్‌ను పరిశీలించి మెనూపై వంట మనుషులతో ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన హనుమకొండ జిల్లా కమలాపూర్, కాసీంపల్లికి చెందిన దివ్యాంగ విద్యార్థినికి గురుకులంలో అడ్మిషన్ ఇప్పించి పుస్తకాలు, యూనిఫాంలు, కాస్మొటిక్ కిట్స్ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముత్తిరెడ్డి నీరజ, ఉపాధ్యాయులు ఆసియా పర్వీన్, రమాదేవి ఉన్నారు.

చెత్త చిక్కుముడులు విప్పాల్సిందే..

కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్ : గృహాలు, వాణిజ్య సంస్థలనుంచి ఏ రోజుకారోజు చెత్త సేకరణకు ఎదురవుతున్న చిక్కుముడులకు కారణాలు చెప్పకుండా చేధిస్తూ వందశాతం సేకరించి డంపింగ్ యార్డుకు చేర్చాల్సిందేనని ప్రజారోగ్యం అధికార యంత్రాంగానికి గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటేషన్‌పై కమిషనర్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. 66వ డివిజన్లలో కంపోస్ట్ యార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తడి, పొడిచెత్తను వేరుగా అందించేలా ప్రతీ కార్మికుడు, ఉద్యోగి ప్రజలను జాగృతం చేయాలన్నారు. వరంగల్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడానికి సమర్థవంతమైన శానిటేషన్ పద్ధతులను అవలంబించాలని సూచించారు. బయోమెట్రిక్ అటెండెన్స్, పబ్లిక్‌టాయిలెట్ల నిర్వహణ, ప్లాస్టిక్ నివారణ, ట్రేడ్‌లైసెన్సులు, దోమల నివారణకు ఫాగింగ్ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చూడాలన్నారు. సమావేశంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్ శానిటరీ సూపర్ వైజర్లు భాస్కర్, నరేందర్ ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను మదింపు, వసూళ్లపై దృష్టి సారించండి

ఆస్తిపన్ను మదింపు, వసూళ్లపై సీరియస్‌గా దృష్టి సారించాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో సమావేశం జరిగింది. మేయర్, కమిషనర్ మాట్లాడుతూ.. కొత్త ఇంటినంబర్లు, ఆస్తుల పేరు మార్పిడి, విభజన, రివైజ్ చేపట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ జోనా డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, ఈఈ రవికుమార్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్‌ఓలు యూసుఫొద్దీన్, శ్రీనివాస్, షహజాదీ బేగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

'కుడా' వైస్ చైర్‌పర్సన్‌గా చాహత్ బాజ్‌పాయ్

నయీంనగర్: కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) వైస్ చైర్‌పర్సన్‌గా చాహత్ బాజ్‌పాయ్ శనివారం హనుమకొండ 'కుడా' కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా కొనసాగుతున్న బాజ్‌పాయ్‌ను 'కుడా' వైస్ చైర్‌పర్సన్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో పదవీ బాధ్యతలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది.. ఆమెకు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

ఇరువర్గాల దాడి.. తీవ్ర ఉద్రిక్తత

● సోషల్ మీడియాలో పోస్టే ఘర్షణకు కారణం..?

రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తవాడకు చెందిన తుమ్మల కుంట ప్రాంతంలో శుక్రవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మొదట ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు యువకుల మధ్య జరిగిన దాడి రెండు కుటుంబాలతో పాటు రెండు ప్రాంతాలకు విస్తరించి సామూహిక దాడికి దారితీసింది. ఇరువర్గాల ఫిర్యాదుతో మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవాడ తుమ్మలకుంటకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి సాజిద్, అదే ప్రాంతానికి చెందిన పదో తరగతి విద్యార్థి అర్బాత్ మధ్య శుక్రవారం సాయంత్రం మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. గాయపడిన అర్బాత్ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలపడంతో ఆగ్రహించిన కుటుంబీకులు రాత్రి 8 గంటలకు సాజిద్ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారు. వెంటనే విషయం తెలుసుకున్న సాజిద్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు 9గంటల సమయంలో అర్బాత్ ఇంటికి వెళ్లి వారి ఇంటిపై దాడి చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు గ్రూపులు విడిపోయి ఒకరిపై ఒకరు పెద్ద ఎత్తున దాడి చేసుకునేందుకు సన్నద్ధమవుతున్న క్రమంలో స్థానికులతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వారిని శాంతింప చేశారు. ఈ ఘటనకు కారణమైన వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాజిత్, అర్బాత్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు.

ఆ.. పోస్టే ఘర్షణకు కారణం?

శుక్రవారం రాత్రి నగరంలోని తుమ్మలకుంటలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరు వర్గాలు దాడి చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్టే కారణమని చర్చించుకుంటున్నారు. మైనర్లు ప్రేమించుకుంటున్నామని నెపంతో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుతో ఇరు కుటుంబ సభ్యులు ఘర్షణకు పాల్పడ్డట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని టీటీడీ కల్యాణ మంటపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 112మంది క్రీడాకారులు వచ్చినట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా పేర్కొన్నారు. ఆర్బిటర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.ప్రేమ్ సాగర్, ప్రాంక్లిన్, కట్కూరి అక్షయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

‘జూనోటిక్’తో జాగ్రత్త

పెంపుడు కుక్కలతో జర భద్రం

● రేబిస్ నివారణకు టీకా తప్పనిసరి

● నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



డాక్టర్ ప్రవీణ్ కుమార్, పశు వైద్య కేంద్రం వడ్డెపల్లి

సంగెం/మహబూబాబాద్/హన్మకొండ : కుక్కలు, పశువులు, కోళ్లు, పక్షులు, ఇతర జంతువుల నుంచి సంక్రమించే జూనోటిక్ వ్యాధుల విషయంలో జంతు ప్రేమికులు, పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలి. పశువులు, వాటి పాకల అపరిశుభ్రత తదితర కారణాలతో సుమారుగా 200 రకాల నేడు (ఆదివారం) ప్రపంచ జూనోసిస్ డే ను జరుపుకుంటున్న సందర్భంగా వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తం చేయడంతో పాటు వ్యాధులపై విస్తృత ప్రచారం కల్పించాల్సి అవసరముంది. ఈ సందర్భంగా సంగెం పశువైద్యాధికారి వల్లె రాజు, మహబూబాబాద్ జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, వడ్డెపల్లి పశువైద్యశాల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ పలు సూచనలు చేశారు. పెంపుడు కుక్కలు, ఇతర జంతువుల యజమానులు రేబిస్ నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. పశువైద్యశాలల్లో రేబిస్ నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రేబిస్ సోకిన వీధి కుక్కలు కరిస్తే పాడి పశువులు సైతం మృత్యువాత పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

జూనోసిస్ డే సందర్భంగా నేడు (ఆదివారం) ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీకా కార్యక్రమంలో ఉంటుందని పశువైద్యులు తెలిపారు. యజమానులు తమ పెంపుడు జంతువులతో ఉదయం 8 గంటల వరకు పశు వైద్య కేంద్రానికి చేరుకోవాలన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు..

ఇంట్లో పెంచే పెంపుడు కుక్కలకు మొదటిసారి 30 వ రోజు, బూస్టర్ డోస్ 90 రోజులకు, దీంతో పాటుగా ఏటా రేబిస్ నివారణ టీకాలు వేయించాలి. కుక్కలతో సన్నిహితంగా ఉండేవారు రేబిస్ సోకకుండా వ్యాధి నివారణ టీకాలు వేయిస్తూ ఉండాలి.



కుక్కకు రేబిస్ నివారణ టీకా ఇస్తున్న పశువైద్యాధికారి రాజు

అంత్రాక్స్, బ్రూసెల్లోసిస్

పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు అనేకం. దొమ్మ (అంత్రాక్స్) మటన్ కొట్టే వారికి, గొర్రెలు, మేకలు, పశువులు చనిపోతే చర్మంకోసం వాటిని కోసేవారికి ఈ వ్యాధి సోకే ప్రమాదముంది. కొమ్ములు, చర్మం, ఎముకలతో సంబంధమున్న పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ వ్యాధి సోకవచ్చు. బ్రూసెల్లోసిస్ ఇది డెయిరీఫాంలో పనిచేసే వారికి, పశు వైద్యులకు సోకే అవకాశముంది. పందులను కరిచిన దోమ మనుషులకు కుట్టినప్పుడు మెదడువాపు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పందులను మనుషులకు దూరంగా ఉంచడం, వ్యాధినిరోధక టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధి నివారించవచ్చును.

ఈ వ్యాధులు కూడా..

హైడాటిసిస్, ఏకై కోకస్ (అంతర్గత పరాన్న జీవులు) కారణంగా కూడా మనుషులకు జూనోటిక్ వ్యాధులు సోకుతాయి. పశువులు, కుక్కల శరీరంలో ఉండే బద్దె పురుగులు గుడ్లు పెడతాయి. పశువుల మాంసాన్ని సరిగా ఉడికించకుండా తింటే బద్దె పురుగుల గుడ్లు మానవుల శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యాన్ని కలుగజేస్తాయి. ఇక కోళ్లఫారాల్లో పనిచేసే వారికి, సరిగా ఉడికించని గుడ్లు, మాంసం తిన్నవారికి సాల్మోనుల్లోసిస్ సోకుతుంది. కుళ్లిన ఆహార పదార్థాలు తిన్నవారు కూడా ఈ వ్యాధి బారిన పడతారు.

నివారణ చర్యలు..

వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసం, గు డ్లు సరిగా ఉడికించకుండా తినకూడదు. పాడైన, అపరిశుభ్రంగా ఉన్న పాలు, మాంసం, గుడ్లను ఆహారంగా తీసుకోకూడదు. రేబిస్ సోకిన పశువుల పాలు తాగకూడదు. పాడి పశువులు, జంతువుల పాకలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలి. పశువులు, జంతువులు, పక్షులు, కోళ్లకు కాలానికి అనుగుణంగా రోగ నిరోధక టీకాలను వేయించా లి. పెంపుడు కుక్కలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి డీవార్మింగ్ మందులు తినిపించాలి. చనిపోయిన పశువులు, జంతువులను దూర ప్రాంతాల్లో లోతైన గుంతలో సున్నం చల్లి పూడ్చి పెట్టాలి.

నేడు ప్రపంచ జూనోసిస్ డే

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను నివారించేందుకు చాలా ఏళ్ల పాటు బ్రిటిష్ శాస్త్రవేత్తలు టీకాతో ప్రయోగాలు చేశారు. 1885 జూలై 6వ తేదీన లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారిగా పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో అప్పటి నుంచి ఆ రోజును ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తున్నారు.

పశువులకు రేబిస్ సంక్రమణ ఇలా...

పశువులకు పిచ్చికుక్కలు కరవడం ద్వారానే ఎక్కువగా రేబిస్ సోకుతుంది. రేబిస్ ఎక్కువగా కుక్కలు, పిల్లులు, ముంగీసలు, నక్కలు, తోడేళ్లు తదితర జంతువుల ద్వారా చిట్టెలుక నుంచి ఏనుగు వరకు అన్ని క్షీరదాలకు సోకుతుంది. కుక్క కరిచిన తర్వాత వ్యాధి లక్షణాలు 2నుంచి 3 వారాల తర్వాత కనబడుతాయి. మెడ ప్రాంతాల్లో కరిస్తే వ్యాధి లక్షణాలు త్వరగా కనబడుతాయి. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ప్రతీ ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) ఇప్పిస్తే వ్యాధిని అరికట్టవచ్చు.

‘కొలంబో’పై సీబీఐ కేసుతో ఉత్కంఠ

● ఆస్పత్రి, మెడికల్ కాలేజీ వర్గాల్లో టెన్షన్ టెన్షన్



వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్

కాజీపేట రూరల్ : ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాలపై సీబీఐ కేసు ఘటన అందరిలో ఉత్కంఠ రేపుతోంది. వరంగల్ హంటర్ రోడ్డు బ్రిడ్జి సమీపంలోని ఫాదర్ కొలంబో మెడికల్ ఆస్పత్రి (ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సీబీఐ కేసు ఘటన మెడికేర్ ఆస్పత్రి వర్గాల్లో, మెడికల్ కాలేజీ వర్గాల్లో దడ పుట్టిస్తోంది. 2023లో అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీష్‌రావు ఈ మెడికల్ కళాశాలను ప్రారంభించారు. క్యాంపస్‌లో మెడికేర్ జనరల్ ఆస్పత్రి, ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ, పారా మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, బీఎస్సీ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ నిర్వహిస్తున్నారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం మెడికల్ విద్యార్థులకు ల్యాబ్ సదుపాయాలు, బోధన, వసతి, పరికరాలు, ఫ్యాకల్టీ, మేనేజ్‌మెంట్ సిస్టం మొదలగునవి నిర్వహణ ఉండాలి. మెడికల్ కాలేజీ నిర్వాహణలో నిబంధనలు ఉన్నాయా లేదా అనే అనుమానాలు వస్తున్నాయి. కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు అధికార అనుమతుల కోసం ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ ట్రస్టీ మెంబర్ కొమ్మారెడ్డి జోసెఫ్ మెడికల్ కాలేజీల తనిఖీలో అనుకూలంగా నివేదికలు ఇచ్చేందుకు రూ.46 లక్షలు లంచం ఇచ్చినట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ స్కాంలో తేలింది. ఈ విషయంలో జోసెఫ్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. కాగా ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ సీబీఐ కేసు విషయంలో అసలు ఏం జరుగుతుందని ఆస్పత్రి వర్గాలు, మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా కళాశాల నడుస్తుందని కాలేజీ వర్గాలు అంటున్నాయి.

కాచిగూడ-తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

● ఈనెల 10వ తేదీ నుంచి అమలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ-తిరుపతి మధ్య వారాంతపు 8 ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

ఈ నెల 10, 17, 24, 31వ తేదీల్లో కాచిగూడ-తిరుపతి (07653) వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం కాజీపేటకు చేరుకొని వెళ్తుంది. ఈ నెల 11, 18, 25, ఆగస్టు 1వ తేదీల్లో తిరుపతి-కాచిగూడ (07654) వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం కాజీపేటకు చేరుకొని వెళ్తుంది. ఈ వీక్లీ రైళ్లకు అప్ అండ్ డౌన్‌లో 1 ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ అండ్ జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఉన్న ఈ ఎక్స్‌ప్రెస్ మల్కాజిగిరి, చర్లపల్లి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

రేపే కేయూ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

● పీహెచ్‌డీలు, గోల్డ్ మెడల్స్ ప్రదానం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈనెల 7న (సోమవారం) నిర్వహించనున్న స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం కేయూలోని సెనేట్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వీసీ వివరాలు వెల్లడించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ స్నాతకోత్సవానికి హాజరు కానున్నారని తెలిపారు. ముఖ్యఅతిథిగా శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, హైదరాబాద్‌లోని ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన బోతున్నారని చెప్పారు. సోమవారం ఉదయం11గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హైదరాబాద్ నుంచి వరంగల్ నిట్‌కు చేరుకుంటారని అనంతరం బయలుదేరి 11:25గంటలకు కేయూకు రానున్నారని వెల్లడించారు. తొలుత స్నాతకోత్సవానికి సంబంధించి అకడమిక్ సెనేట్ సమావేశం జరుగనుందని తెలిపారు.

387మందికి పీహెచ్‌డీ పట్టాలు, 373 మందికి 564 గోల్డ్ మెడల్స్ ప్రదానం

కేయూలో 2020–25 జూన్ 30వరకు ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఫార్మసీ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్, లా, ఇంజనీరింగ్ విభాగాల్లో 387 మందికి గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీల ప్రదానం జరుగనుందన్నారు. అదే విభాగాలకు చెందిన 2016–21వరకు 373 మంది అభ్యర్థులకు 564 గోల్డ్ మెడల్స్‌ను కూడా స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్నారని వీసీ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. స్నాతకోత్సవ వేడుకను అన్ని విభాగాల సహకారంతో విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది సహకరించి విజయవంతవ చేసేలా సహకరించాలని వీసీ కోరారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

ఈనెల 7న ఉదయం 8:30గంటలకు హైదరాబా ద్‌లోని రాజ్‌భవన్ నుంచి బయలుదేరి వరంగల్ నిట్‌కు 11గంటలకు చేరుకుంటారు. కొద్దిసేపు అక్కడే ఉండి ఉదయం 11:15 గంటలకు బయలుదేరి కాకతీయ యూనివర్సిటీకి 11:25 గంటలకు చేరుకుంటారు. ఉదయం 11:30గంటల నుంచి మధ్యాహ్నం 1:15గంటల వరకు స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

కలెక్టర్లతో సమావేశం

కేయూలో స్నాతకోత్సవం కార్యక్రమం ఉదయం 11:30గంటల నుంచి మధ్యాహ్నం 1:15 గంటలకు ముగియనుంది. అనంతరం కేయూ గెస్ట్‌హౌజ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ లంచ్ చేస్తారు. మధ్యాహ్నం 2గంటలకు కాకతీయ యూనివర్సిటీనుంచి బయలుదేరి 2:10గంటలకు వరంగల్ నిట్ చేరుకుంటారు. 2:30గంటల వరకు అక్కడే ఉంటారు. మధ్యాహ్నం 2:30గంటల నుంచి మధ్యాహ్నం 3:15గంటల వరకు వరంగల్, హనుమకొండ కలెక్టర్ల సమావేశంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పాల్గొంటారు. యాక్షన్ ప్లాన్ ఫర్ ఎరాడికేషన్ ఆఫ్ టీబీ టీబీ ఆఫీసర్లు, ఐఆర్‌సీఎస్ రిప్రెజెంటిటీవ్స్ పాల్గొంటారు. ఆ తర్వాత గవర్నర్ హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారని సమాచారం.

స్నాతకోత్సవాన్ని అడ్డుకోవద్దు

● వీసీ, రిజిస్ట్రార్, పోలీసు అధికారులు

● విద్యార్థి సంఘాల నాయకులతో చర్చలు



విద్యార్థులతో చర్చిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పోలీసులు

కేయూ క్యాంపస్ : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీలో నిర్మించేందుకు పాలకమండలి ఆమోదం తెలపగా దాన్ని వెనక్కి తీసుకోవాలని వివిధ విద్యార్థి సంఘాలు కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్న విషయం విదితమే. అంతేగాకుండా ఆమోదాన్ని వెనక్కి తీసుకోకపోతే ఈనెల 7న కేయూలో జరిగే స్నాతకోత్సవాన్ని అడ్డుకుంటామని కూడా వివిధ విద్యార్థి సంఘాలు హెచ్చరించిన విషయం విదితమే. దీంతో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులతో క్యాంపస్‌లోని అకడమిక్ కమిటీ హాల్‌లో సమావేశం నిర్వహించి, వారితో చర్చలు జరిపారు. హహనుమకొండ ఏసీపీ నర్సింహారావు, కేయూ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ పాల్గొన్నారు. స్నాతకోత్సవ వేడుకకు సహకరించాలని వీసీ, రిజిస్ట్రార్ విద్యార్థి సంఘాల బాధ్యులను కోరారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు యంగ్ ఇండియా స్కూల్‌కు ఎట్టి పరిస్థితుల్లోను భూమి ఇవ్వొద్దని యూనివర్సిటీ భూమిని కేటాయిస్తూ పాలక మండలి ఎలా ఆమోదిస్తుందని ప్రశ్నించినట్లు సమాచారం. పాలకమండలి ఆమోదంను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా తమకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని పలు విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారని సమాచారం. మరో రెండు విద్యార్థి సంఘాల బాధ్యులు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమిని కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని యూనివర్సిటీ భూమిలోనే నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీంతో కొద్దిసేపు వారి మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకున్నట్లు సమాచారం.

గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అవకాశం

యూనివర్సిటీ సమస్యలపై గవర్నర్‌కు విన్నవించేందుకు తమకు అవకాశం కల్పించాలని పలు విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. స్నాతకోత్సవం తర్వాత లంచ్ అయిపోయాక కేయూ గెస్ట్‌హౌజ్ వద్ద గవర్నర్‌ను కలిసేలా అవకాశం కల్పిస్తామని విద్యార్థి సంఘాల నాయకులకు హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, వీసీ ప్రతాప్‌రెడ్డి తెలియజేశారని సమాచారం. దీంతో విద్యార్థి సంఘాల బాధ్యులు కూడా ఒకే అన్నట్లు తెలిసింది.

భూమిని కేటాయించబోమని.. పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని..

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేయూ భూమిని కేటాయించబోమని వీసీ ప్రతాప్‌రెడ్డి ఆదివారం వరకు ప్రకటించాలని లేనిచో స్నాతకోత్సవాన్ని అడ్డుకుంటామని ఓ విద్యార్థి సంఘం నాయకులు తేల్చిచెప్పారని సమాచారం. అలాగే తమకు పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తామని కూడా వీసీ ప్రకటించి హామీ ఇవ్వాలని లేకుంటే స్నాతకోత్సవాన్ని అడ్డుకుంటామని మరో విద్యార్థి సంఘం నాయకుడు తేల్చి చెప్పారని సమాచారం. ఈ పరిస్థితుల్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంలో పోలీస్ అధికారులు తర్జనభర్జన పడుతున్నారని సమాచారం.

సహకార భావనతోనే సమాజాభివృద్ధి

● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు




డీసీసీబీ ఆవరణలో మొక్క నాటుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ : సహకార భావనతోనే సమాజాభివృద్ధి సాధ్యమనే నినాదంతో సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలపాలని రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆకాంక్షించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ సహకార వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా డీసీసీబీ కార్యాలయ ఆవరణలో రవీందర్ రావు మొక్క నాటి, మాట్లాడుతూ.. ప్రతి ఏటా జూలై మొదటి శనివారాన్ని అంతర్జాతీయ సహకార దినోత్సవంగా జరుపుకుంటారని వివరించారు. సహకార సంస్థల పాత్ర, వాటి ప్రయోజనాలు, సామాజిక ప్రభావాన్ని విశ్వవ్యాప్తంగా తెలియజేయడమే సహకార దినం ఉద్దేశమన్నారు. 2012లో మొదటి అంతర్జాతీయ సహకార సంవత్సరం నిర్వహించినట్లు గుర్తు చేశారు. 13 సంవత్సరాల తర్వాత ఈ వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు. తెలంగాణలో మహిళా సహకార సంఘాలు, స్వయం సహాయక సమూహాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. యువతకు సహకార రంగాల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు ఎన్నమనేని జగన్‌మోహన్ రావు, నరేందర్, సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎంలు ఉషా శ్రీ, పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు గొట్టం స్రవంతి, మధు, రాజు, గంప స్రవంతి, కృష్ణ మోహన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

● ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు



మధుసూదన్‌రావుకు పూలబొకే అందజేస్తున్న నాయకులు

హన్మకొండ : సంస్థ అభివృద్ధికి ఉద్యోగ సంఘాలు పాటుపడాలని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.మధుసూదన్ రావు తెలిపారు. శనివారం నక్కలగుట్టలోని హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ మధుసూదన్ రావుకు తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఉద్యోగులను అంకితభావంతో పని చేయించడంలో సంఘాలు తమ పాత్రను పోషించాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ధరావత్ లక్ష్మణ్ నాయక్, కార్యదర్శి కడెం మహేష్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాజు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లు గొలుసు ఉపేందర్, సంపత్ కుమార్, ఉపాధ్యక్షులు, అదనపు కార్యదర్శులు, సెక్రెటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కోశాధికారి పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలి

● విద్యాశాఖ సమీక్షలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, సంబంధిత అధికారులు

న్యూశాయంపేట : జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఎంఈఓలను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా విద్యాశాఖాధికారి, ఎంఈఓలతో విద్యాశాఖపై సమీక్షించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, యూనిఫామ్‌ల పంపిణీ, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ, కేజీబీవీల్లో గ్రేడింగ్, కాంట్రాక్టు రెన్యువల్, యూడైస్ డేటా ఎంట్రీ తదితర అంశాలపై చర్చించారు. జిల్లాల్లో మొత్తం 531 పాఠశాలల్లో చదువుతున్న 33,878 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.


ఐదు ప్రాథమిక పాఠశాలల మంజూరు

జిల్లాలో అదనంగా ఐదు ప్రాథమిక పాఠశాలలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. గీసుకొండ మండలం నందనాయక్ తండా, చిన్నగురిజాల, పార్శ్యానాయక్ తండా, స్వామినాయక్ తండా, నర్సంపేట మండల భోజ్యానాయక్ తండాలో ఈ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎంఈఓలను ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీలుగా ఏర్పాటుచేసి ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించాలని ఆదేశించారు. సమీక్షలో డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, ఎంఈఓలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంల పరిశీలన

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని ఈవీఎం గోదాంలను కలెక్టర్ డాక్టర్ సత్యశారద శనివారం తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గోదాం, స్ట్రాంగ్ రూం, రికార్డులు, భద్రత చర్యలు, సీసీ కెమెరాలను పరిశీలించారు.

ప్రజారక్షణే లక్ష్యంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్



వీపీఓ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

● సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

కాజీపేట అర్బన్ : ప్రజా రక్షణే లక్ష్యంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీఓ) కార్యక్రమానికి నగర సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాలతో శ్రీకారం చుట్టినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేజ్ పోలీస్ ఆఫీసర్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల వద్దకే పోలీసులు చేరుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, పోలీస్‌ల పట్ల భయాన్ని తొలగించి మంచి సంబంధాలను కల్పించడం, మహిళలు, చిన్నారులు, వృద్ధుల సంరక్షణలో పోలీసులు తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించేందుకు ఈ విలేజ్ పోలీస్ ఆఫీసర్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మడికొండ పీఎస్ పరిధిలోని ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి, అహింస, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరిని భాగస్వాములు కావాలన్నారు. అనంతరం మడికొండ పీఎస్ పరిధిలోని గ్రామాలకు ఏర్పాటు చేసిన విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సైలు, సిబ్బంది, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.